క్లుప్తంగా

ఆదిగణపతి లడ్డూ వేలం


అంగరలో లడ్డూతో పాటదారులు

కపిలేశ్వరపురం: అంగరలోని చప్పిడిపాలెం సెంటర్ ఆదిగణపతి శిబిరంలో గురువారం లడ్డూ వేలం నిర్వహించారు. గ్రామానికి చెందిన చింతా శ్రీనివాస్ స్వామికి సమర్పించిన 11 కిలోల లడ్డూ అదే గ్రామానికి చెందిన బత్తిన శ్రీనివాస్, యర్రా సుబ్బారావు, కొల్లాటి సురేష్‌లు రూ.2,100కి పాట పాడుకున్నారు. లడ్డూను భక్తులకు పంచారు. కార్యక్రమంలో మేడేపల్లి కొండ, పెద్దింశెట్టి సూర్యచంద్రరావు, పడాల రామకృష్ణ, యర్రా వీరన్నబాబు, చీకట్ల గంగరాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత బస్సుపాస్‌లు


బస్సు పాస్‌లతో విద్యార్థులు

కపిలేశ్వరపురం: మాచర జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆర్టీసీ సంస్థ గురువారం ఉచిత బస్సుపాస్‌లు అందజేసింది. ఆర్టీసీ సంస్థ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది సంయుక్త కృషితో జారీ చేసిన బస్సు పాస్‌లను హెచ్‌ఎం రమాదేవి చేతులు మీదుగా అందజేశారు. మండపేటకు చెందిన మాధవి ఎడిబుల్ బ్రాన్ ఆయిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సౌజన్యంతో 109 మందికి పాస్‌లను అందజేశారు.

మాతా శిశు సంరక్షణకు ప్రత్యేక చర్యలు


సామూహిక సీమంతాలు నిర్వహిస్తున్న దృశ్యం

రామచంద్రపురం రూరల్: మాతా శిశు సంరక్షణకు ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తూ, ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని ఎంపీపీ అంబటి భవాని, మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అన్నారు. పౌష్టికాహార మహోత్సవాల్లో భాగంగా గర్భిణులకు పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత నివారణకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ వి.వరహాలక్ష్మి, మండల సూపర్‌వైజర్లు కె.నాగేశ్వరి, కె.అమ్మాజీ, ఐ.కల్యాణి పాల్గొన్నారు.

పశు వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ నాగమణి

కె.గంగవరం: పశువులకు తరచుగా వచ్చే వ్యాధులపై పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని మండపేటలోని రాష్ట్రీయ పశు శిక్షణ కేంద్రం జాయింట్ డైరెక్టర్ చంద్రశేఖర్, డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కుందూరులో రాష్ట్రీయ పశు శిక్షణ కేంద్రం గురువారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. దీనిని ఎంపీపీ పంపన నాగమణి ప్రారంభించారు. అనంతరం పాడి రైతులకు ఉచితంగా మినరల్ మిక్చర్, కాల్షియం, గర్భకోశ వ్యాధుల నివారణ మందులను ఉచితంగా అందించారు. గ్రామంలోని 54 మందికి చెందిన 87 పాడి పశువులకు పలువురు పశువైద్యులు ఉచితంగా పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో అమలాపురం డిప్యూటీ డైరెక్టర్ మూర్తి, రామచంద్రపురం ఏడీ రామకృష్ణ, పశువైద్యులు కృష్ణార్జున్, ప్రసాద్, సంయుక్త పాల్గొన్నారు.

అవినీతిపరుల కోసం దువా సరికాదు


ఆలీఖాన్ బాబా

మండపేట: అవినీతిపరులను కాపాడాలని కోరుతూ ముస్లింలు ఎప్పుడు దువా (ప్రార్థన) చేయరని రాష్ట్ర షేక్ అండ్ షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ ఆలీఖాన్ బాబా అన్నారు. మండపేటలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇటీవల టీడీపీ ఆధ్వర్యంలో కొందరు ముస్లిలు స్థానిక కలువపువ్వు సెంటర్ వద్ద రిలే నిరాహార దీక్ష శిబిరంలో పాల్గొని అవినీతి కేసులో జైల్లో ఉన్న మాజీ సీఎం చంద్రబాబుకు అనుకూలంగా, పేదల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి వ్యతిరేకంగా ప్రార్థనలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఇస్లాంలో శాంతి సౌభాగ్యం కోసం, నీతి నిజాయితీ, మంచి కోసం మాత్రమే ప్రార్థన చేస్తారని వారు తెలుసుకోవాలన్నారు. ముస్లిం మైనార్టీల సంక్షేమానికి సీఎం జగన్ అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలుచేస్తుంటే ఆయన వ్యతిరేకంగా ప్రార్థనలు చేయడం సరికాదని ఆలీఖాన్ బాబా హితవు పలికారు.

చిగురిస్తున్న ఆశలు

- ఇకనైనా సొంత భవనం ఏర్పడేనా!
- దశాబ్దాలుగా పరాయి పంచనే గొల్లపాలెం పోలీస్ స్టేషన్
- ఇటీవల సందర్శించిన కాకినాడ జిల్లా ఎస్పీ
- సొంత గూడుపై ఉన్నతాధికారులతో చర్చిస్తామని హామీ


పీహెచ్‌సీ సబ్ సెంటర్‌లో కొనసాగుతున్న గొల్లపాలెం పోలీస్ స్టేషన్

కాజులూరు: దశాబ్దాల చరిత్ర కలిగిన గొల్లపాలెం పోలీస్ స్టేషన్‌కు సొంత భవనం ఏర్పడే అంశంపై ఆశలు చిగురిస్తున్నాయి. వారం రోజుల కిందట ఈ స్టేషన్‌ను సందర్శించిన కాకినాడ జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ సొంత గూడు ఏర్పాటు దిశగా అడుగులు వేస్తామని భరోసా ఇచ్చారు. కోరంగి పోలీస్ స్టేషన్ నుంచి 10, రామచంద్రపురం పోలీస్ స్టేషన్ నుంచి 14 గ్రామాలను కలుపుతూ 1946లో గొల్లపాలెం పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేశారు. ఆ తరువాత మండలాల ఏర్పాటుతో కాజులూరు మండలంలోని 26 గ్రామాలు గొల్లపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోకి వచ్చాయి. ఆరంభమైనప్పటి నుంచి 65 ఏళ్ల పాటు ఒకే అద్దె భవనంలో ఈ పోలీస్ స్టేషన్ కొనసాగింది. భారీ వర్షాలకు ఆ భవనం 2011లో కూలిపోయింది. అనంతరం జర్నలిస్టు కాలనీకి ఆనుకుని ఉన్న పీహెచ్‌సీ సబ్ సెంటరులోకి పోలీస్ స్టేషన్‌ను మార్చారు. అప్పటి నుంచీ అది అక్కడే కొనసాగుతోంది. అయితే పీహెచ్‌సీ సబ్ సెంటర్ మరీ చిన్న భవనం కావడంతో సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిందితులను ఉంచేందుకు లాకప్ సైతం లేదు. ఇదే అదనుగా ఎనిమిది నెలల క్రితం రిమాండ్‌లో ఉంచిన ముగ్గురు బాల నేరస్తులు పరారయ్యారు. రికార్డులు భద్రపరచుకునే గదులు కూడా ఇక్కడ లేవు. ఉన్న రెండు గదులనే వివిధ విభాగాలుగా విభజించి, సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. మరుగుదొడ్లు కూడా లేకపోవడంతో అత్యవసర సమయాల్లో సిబ్బంది ఆరుబయటకు వెళ్లాల్సి వస్తోంది. ఈ స్టేషన్‌లో ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లు ఉన్నారు. వారి ఇబ్బందులు వర్ణనాతీతం. భవనం పల్లపు ప్రాంతంలో ఉండటంతో కొద్దిపాటి వర్షం వచ్చినా జలమయమవుతోంది. దీంతో పరిసరాల్లో అపరిశుభ్రత ఏర్పడుతోంది.

మురిగిపోతున్న నిధులు

గొల్లపాలెం పోలీస్ స్టేషన్‌కు సొంత భవనం నిర్మించేందుకు మూడుసార్లు నిధులు మంజూరు కాగా, సరైన స్థలం లేక అవి మురుగుపోయాయి. పంచాయతీ కార్యలయాన్ని ఆనుకుని ఉన్న ఎనిమిది సెంట్ల స్థలాన్ని పోలీస్ స్టేషన్‌కు కేటాయిస్తూ గతంలో సర్పంచ్‌లుగా పని చేసిన పోతురాజు బాబూరావు, కొప్పుల సత్యనారాయణ రెండుసార్లు వారి హయాంలో తీర్మానాలు చేశారు. అయితే నిబంధనల ప్రకారం పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి కనీసం 10 సెంట్ల స్థలం అవసరం. దీంతో వచ్చిన నిధులు మురిగిపోయాయి. ప్రస్తుతం కాకినాడ – కోటిపల్లి రోడ్డులో స్టేట్ బ్యాంక్ పక్కన ఖాళీగా ఉన్న రెవెన్యూ స్థలం స్టేషన్ భవన నిర్మాణానికి అనుకూలంగా ఉండటంతో ఆ మేరకు గ్రామ పంచాయతీ తీర్మానం చేసి ఇచ్చింది. అయితే భవన నిర్మాణానికి మాత్రం రాళ్లు పడటం లేదు. జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ రెండు రోజుల క్రితం ఈ స్టేషన్ తనిఖీకి వచ్చారు. ఇరుకు గదుల్లో స్టేషన్ ఉండటం గమనించి ఆందోళనకు గురయ్యారు. సిబ్బంది, స్థానికుల విజ్ఞప్తి మేరకు స్టేట్ బ్యాంక్ పక్కన ఉన్న ఖాళీ స్థలాన్ని సందర్శించారు. ఇక్కడ నూతన భవన నిర్మాణానికి ఉన్నతాధికారులతో చర్చించి, తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. దీంతో సొంత భవన నిర్మాణంపై సిబ్బందిలో ఆశలు చిగురిస్తున్నాయి.

ఇబ్బంది పడుతున్నాం



స్టేషన్‌కు సొంత భవనం, సరైన వసతులు లేక ఇరుకు గదుల్లోనే విధులు నిర్వహిస్తున్నాం. నాయకులు, అధికారులు స్పందించి భవన నిర్మాణానికి తగిన చర్యలు తీసుకోవాలి.

– ఎం.తులసీరామ్ ఎస్సై, గొల్లపాలెం

కూర్చునేందుకు జాగా లేదు



స్టేషన్‌లో సిబ్బంది విధుల నిర్వహణకే చోటు లేదు. ఇక స్టేషన్‌కు వెళ్తున్న ఫిర్యాదీలు కూర్చునేందుకు కనీసం జాగా కూడా లేని పరిస్థితి నెలకొంది.

– పెంకే సత్యనారాయణ, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్, కాజులూరు

నంది నాటక పోటీలకు హెచ్‌ఎం శ్రీనివాస్ ఎంపిక



కె.గంగవరం: అద్దంపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.శ్రీనివాస్ నంది నాటక పోటీలకు ఎంపికయ్యారు. ఏపీ చలనచిత్ర, టీవీ, నాటక రంగ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన నవంబర్ మొదటి వారంలో 22వ నంది నాటక పోటీలు జరగనున్నాయి. వీటికి సంబంధించి పద్య నాటక విభాగంలో నంది అవార్డుల కోసం ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి 28 నాటక సమాజాలు పోటీ పడ్డాయి. తుది పోటీలకు 10 పద్య నాటకాలను ఎంపిక చేశారు. వీటిలో కాకినాడకు చెందిన శ్రీ సీతారామాంజనేయ నాట్య మండలి ప్రదర్శించిన పౌరాణిక రంగస్థల పద్య నాటకం సీతాకల్యాణం తుది ప్రదర్శనకు ఎంపికయ్యింది. ఇందులో దశరథుని పాత్రను శ్రీనివాస్ పోషించారు. నంది నాటక పోటీలకు ఎంపికైన ఆయనను సర్పంచ్ చింతపల్లి లక్ష్మి, వైస్ ఎంపీపీ దూడల నాగేశ్వరావు, గ్రామ పెద్దలు అభినందించారు.

జగనన్న పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు

కాజులూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎంపీపీ మాత భారతి అన్నారు. దుగ్గుదుర్రు, కుయ్యేరు తదితర గ్రామాల్లో వలంటీర్లతో కలసి ఎంపీపీ, ఇతర నాయకులు కొత్తగా మంజూరైన పింఛన్లను గురువారం లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ, పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పింఛనును క్రమంగా రూ.2,750కి పెంచారని చెప్పారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగనవసరం లేకుండా వలంటీర్ల ద్వారా గడప వద్దనే పింఛన్లు అందజేస్తున్నారని, ఈ కార్యక్రమం దేశానికే ఆదర్శంగా నిలిచిందని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పిల్లి కృష్ణమూర్తి, పోతు వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు మాత మురళి, పోతు జ్యోతికుమార్, పెంకే నాగేశ్వరరావు (నాగు) తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో వార్షిక మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8 గంటలు నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్టు విద్యుత్ శాఖ ఈఈ విజయానంద్ తెలిపారు. అంగర, టేకి, కపిలేశ్వరపురం, శ్రీరాంపురం, వల్లూరు, నల్లూరు, కాలేరు, నేలటూరు, మాచరమట్టలు, వడ్లమూరు గ్రామాలకు విద్యుత్ నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

విద్యార్థులు క్రీడా స్ఫూర్తి కలిగిఉండాలి


కిట్లు అందజేస్తున్న ఎంపీపీ వెంకటరమణ

రాయవరం: విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని కలిగి ఉండాలని ఎంపీపీ నౌడు వెంకటరమణ అన్నారు. గురువారం లొల్ల గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాలలో ప్రభుత్వం మంజూరు చేసిన స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలతో అధిక ప్రాధాన్యతనిస్తోందని అన్నారు. క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, విద్యార్థుల చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని అన్నారు. మండల పరిధిలో గల 33 ప్రాథమిక, 4 ఎంపీయూపీ, 8 జెడ్పీ ఉన్నత పాఠశాలలతో పాటు మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ప్రభుత్వం మంజూరు చేసిన స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేశారు. సర్పంచ్ చాత్రాతి జానకిరాంబాబు, హెచ్‌ఎం నాగిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా గణపతి నవరాత్ర ఉత్సవాలు


మండపేట బస్టాండు వద్ద కోలాట ప్రదర్శన

మండపేట: స్థానిక బస్టాండు వద్ద గణపతి నవరాత్ర ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. స్థానిక 4వ వార్డుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు అయినవిల్లి రాజేష్, నరేష్(చిన్నారి) సోదరులు ఈ ఏడాది నుంచి బస్టాండు వద్ద నవరాత్ర ఉత్సవాలకు నాంది పలికారు. ప్రత్యేకంగా మండపాన్ని నిర్మించి గణనాథున్ని ప్రతిష్ఠించారు. ఉదయం, సాయంత్ర వేళల్లో పూజలతో పాటు భజనలు, కోలాటాలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గురువారం రాత్రి కోలాటం తదితర ప్రదర్శనలు చేశారు. వేడుకల్లో భాగంగా శుక్రవారం తోలు బొమ్మలాట తదితర ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్టు రాజేష్ తెలిపారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పిల్లా వీరబాబు, ఉత్సవ కమిటీ సభ్యులు సాధనాల శివభగవాన్, అయినవిల్లి ఆదినారాయణ, కోయల సాయిబాబా, కాయల రాము, కాయల చంద్రశేఖర్, జీఆర్సీ మోహన్, కాయల రమేష్, కోయల సతీష్, రావూరి దుర్గాప్రసాద్, పిల్లా విజయ్, అంజి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గురజాడ జయంతి


మహాకవి గురజాడకు నివాళులర్పిస్తున్న విద్యార్థులు

మండపేట: మహాకవి, సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు 161వ జయంతి వేడుకలు గురువారం స్థానిక సంఘం కాలనీలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులోయ్ అంటూ నినదించారు. గురజాడ వేషధారణలో విద్యార్థి అలరించాడు. ఉపాధ్యాయులు చిట్టూరి వెంకట శ్రీధర్, శేషారత్నం తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రపురం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు శాఖ ఆధ్వర్యాన మహాకవి గురజాడ అప్పారావు జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కేసీ సత్యలత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ వై.సీతామహాలక్ష్మి ప్రసంగిస్తూ, నాటి సమాజంలో దురాచారాలపై గురజాడ యుద్ధమే చేశారని, తన రచనల ద్వారా సంఘ సంస్కరణకు నాంది పలికారని చెప్పారు. ప్రిన్సిపాల్ సత్యలత మాట్లాడుతూ, కన్యాశుల్కం, పూర్ణమ్మ వంటి గురజాడ రచనలు నేటికీ ఎంతో ఆదరణకు నోచుకుంటున్నాయంటేనే ఆయన గొప్పతనం అర్థమవుతుందని అన్నారు. కార్యక్రమంలో తెలుగు శాఖాధిపతి డాక్టర్ సుజాత, అధ్యాపకులు లక్ష్మి, బేగం, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఎలుకల మందు పంపిణీ


సదస్సులో మాట్లాడుతున్న రామచంద్రపురం ఏఓ సత్యప్రసాద్

మండపేట: వరిపంటలో ఎలుకల బెడదను అరికట్టేందుకు శుక్రవారం మండలంలో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం చేపడుతున్నట్టు మండల వ్యవసాయాధికారి కె.ఏసుబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతు భరోసా కేంద్రాలు, సొసైటీలు, పంచాయతీ కార్యాలయాల వద్ద నూకలు, నూనె, ఎలుకల మందు కలిపిన మిశ్రమాన్ని రైతులకు అందజేస్తామని వివరించారు.

కపిలేశ్వరపురం: మండలంలో వరి సాగు రైతులకు శుక్రవారం ఎలుకల నివారణ నిమిత్తం బ్రోమోడయోలిన్ మందును పంపిణీ చేయనున్నట్టు మండల వ్యవసాయాధికారి కేవీఎన్ రమేష్‌కుమార్ గురువారం తెలిపారు. 192 గ్రాముల నూకలు, 4 గ్రాముల నువ్వుల నూనె, 4 గ్రాముల బ్రోమోడయోలిన్ మందును 10 గ్రాముల చొప్పున 20 పొట్లాలను ఎలుకల బొరియల వద్ద అమర్చుకోవాలని సూచించారు. తాతపూడి, కపిలేశ్వరపురం, కోరుమిల్లి, మాచర, టేకి, నల్లూరు, కాలేరు, వడ్లమూరు, నేలటూరు, వల్లూరు, అంగర, పడమర ఖండ్రిక, వాకతిప్ప, వెదురుమూడి గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల వద్ద ఉదయం 10 గంటలకూ, నిడసనమెట్లలో మధ్యాహ్నం 3 గంటలకు మందు పంపిణీ చేస్తామని ఏఓ రమేష్‌కుమార్ తెలిపారు.

రాయవరం: సామూహిక ఎలుకల నివారణకు గాను మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బ్రోమోడయోలిన్ మందు పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి కె.ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

రామచంద్రపురం రూరల్: సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని రైతుభరోసా కేంద్రాల (ఆర్‌బీకే) వద్ద ఎలుకల నిర్మూలన మందు పంపిణీ చేస్తున్నారు. సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమంపై గ్రామ వ్యవసాయాధికారులకు మండల వ్యవసాయాధికారి (ఏఓ) సత్యప్రసాద్ తన కార్యాలయంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎలుకల నిర్మూలన మందును ఆర్‌బీకేల వద్ద రైతులందరికీ అందించాలని ఆదేశించారు. రైతులందరూ సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమంలో పాల్గొనేలా అవగాహన కల్పించాలని సూచించారు.

రేపు ద్రాక్షారామలో కాపు నేస్తం సదస్సు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామలోని పేపకాయల బాబ్జీ ఫంక్షన్ హాలు శనివారం వైఎస్సార్ కాపు నేస్తం పథకం సదస్సు నిర్వహిస్తున్నారు. ఎంపీడీఓ ఎస్.రాజు గురువారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు జరిగే ఈ సదస్సులో రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరు కావాలని ఎంపీడీఓ విజ్ఞప్తి చేశారు.

సంఘటిత కృషితో సమస్యల పరిష్కారం

కాజులూరు: సంఘటిత కృషితో సంఘాలు బలోపేతమవడం ద్వారా సమస్యలు త్వరితగతిన పరిష్కారమవుతాయని పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గంధం వసంతరావు అన్నారు. సంఘం కాకినాడ జిల్లా అధ్యక్షుడు బండి నూకరాజు ఆధ్వర్యాన పీఆర్‌టీయూ నాయకులు గురువారం పలు గ్రామాల్లో పర్యటించి, సభ్యత్వ నమోదు నిర్వహించారు. గొల్లపాలెం జెడ్పీ హైస్కూల్‌లో వసంతరావు మాట్లాడుతూ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో పీఆర్‌టీయూ ఎప్పుడూ ముందంజలో ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పీఎస్‌వీ ప్రసాద్, మండల శాఖ అధ్యక్షుడు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తెరచుకున్న రొయ్యల కంపెనీలు

తాళ్లరేవు: కోరంగి పంచాయతీలో రొయ్యల కంపెనీలతో వచ్చే వ్యర్థ జలాల కారణంగా ప్రజలు రోగాల బారిన పడుతున్నారంటూ ఇటీవల పలువురు ఎంపీటీసీ సభ్యులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో మూడు రోజులుగా మూతపడిన రొయ్యల కంపెనీలు గురువారం తెరచుకున్నాయి. తాళ్లరేవు రొయ్యల శుద్ధి కేంద్రాల నిర్వాహకులతో పాటు ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ గురువారం కాకినాడ జిల్లా కలెక్టర్ కృతికా శుక్లాను కలసి రొయ్యల కంపెనీ యజమానుల కష్టాలను తెలియజేశారు. దీనికి కలెక్టర్ సానుకూలంగా స్పందించి తక్కువ ఖర్చుతో కూడిన శుద్ధి చేసే విధానం పొల్యూషన్ బోర్డు ద్వారా సూచిస్తామని తెలిపారు. రొయ్యల కంపెనీ యజమాని విత్తనాల కరిమల స్వామి, బొద్దు సత్యనారాయణ, అంజిబాబు, సంగాడి రాజు, రామరాజు, కర్రి రాజు, విజయ్, ధర్మ, వేమా, రమణ దాసు తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరి దింపు కార్మికులను ఆదుకోవాలి

అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే పొన్నాడ


అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్

ముమ్మిడివరం: కోనసీమలో కొబ్బరి దింపు, ఒలుపు కార్మికులను ప్రభుత్వపరంగా ఆదుకోవాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. గురువారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో ఆయన మాట్లాడారు. శెట్టిబలిజ కులస్తులు ఎక్కువగా ఆధారపడే కొబ్బరి దింపు, ఒలుపు కార్మికుల జీవన విధానాలపై విశదీకరించారు. కోనసీమలో ప్రధాన పంటగా ఉన్న కొబ్బరి ఆధారిత పరిశ్రమలపై వేలాది మంది కార్మికులు జీవనోపాధి పొందుతున్నారన్నారు. కొబ్బరి చెట్టుపై నుంచి కాయలు దింపు వరకూ కార్మికులు తరచూ ప్రమాదాలకు గురై మరణించడం లేక శాశ్వత వికలాంగులుగా మిగిలిపోవడం జరుగుతుందన్నారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి రూ.పది లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు. కోనసీమలో కొబ్బరి ఆధారిత పరిశ్రమలను అభివృద్ధి చేసేందుకు కోకోనట్ బోర్డు ఏర్పాటు చేయాలని ఆయన అన్నారు. కొబ్బరి దింపు, ఒలుపు, ఎగుమతి, దిగుమతి కార్మికులకు 50 ఏళ్లకు పింఛన్లు అందజేసేలా చూడాలని కోరారు.

మహిళా రక్షణ కవచం దిశా చట్టం


కందికుప్పలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దిశా డీఎస్పీ మురళీమోహన్

కాట్రేనికోన: ఆపదలో ఉన్న మహిళలకు దిశా చట్టం రక్షణ కవచంలా పనిచేస్తుందని అమలాపురం డీఎస్పీ సుంకర మురళీమోహన్ అన్నారు. గురువారం కందికుప్ప జెడ్పీహెచ్‌ఎస్‌లో ఎస్సై టి.శ్రీనివాస్ అధ్యక్షతన దిశా చట్టం–మహిళల సంరక్షణపై అవగాహన సదస్సు జరిగింది. జిల్లా ఎస్పీ శ్రీధర్ ఆదేశాలతో అడిషనల్ ఎస్పీ ఖాదర్ బాషా ఆధ్వర్యంలో కందికుప్ప జెడ్పీ స్కూల్‌లో విద్యార్థులకు దిశా డీఎస్పీ పలు చట్టాలపై వివరించారు. ప్రతి ఒక్కరూ మొబైల్‌లో దిశా యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలన్నారు. దిశా యాప్ నుంచి కాల్ చేసిన 10 నిమిషాల వ్యవధిలో సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని రక్షణ కల్పిస్తారన్నారు. స్కూల్ హెచ్‌ఎం పి.వెంకటేశ్వరరావు, దిశా ఏఎస్సై రసీద, మహిళా పోలీసులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జీసీఎస్‌లను సందర్శించిన ఎస్‌పీఎఫ్ కమాండెంట్


మోరిలోని ఓఎన్‌జీసీ జీసీపీలో కమాండెంట్ నరసింహారావు

సఖినేటిపల్లి/ఆలమూరు: ఆంధ్రప్రదేశ్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్‌పీఎఫ్) కమాండెంట్ కె.నరసింహారావు గురువారం జిల్లాలో పర్యటించారు. విజయవాడ నుంచి ఇటీవల బదిలీపై వచ్చిన ఆయన రాజమహేంద్రవరం జోన్ కమాండెంట్‌గా బాధ్యతలు స్వీకరించారు. తొలి పర్యటనలో భాగంగా ఆలమూరు – మండపేట రోడ్డులోని పెదపళ్లలోని ఓఎన్‌జీసీ గ్యాస్ కలెక్షన్ స్టేషన్(జీసీఎస్)ను, రాజోలు దీవిలోని మోరి, అడవిపాలెం జీసీఎస్‌లలోని గ్యాస్ కంప్రెషన్ ప్లాంట్ల(జీసీపీ)ను సందర్శించారు. ఆయనకు ఆయా ప్లాంట్లలో అధికారులు ఘన స్వాగతం పలికారు. మోరి ఓఎన్‌జీసీ సైటులో ఎస్‌పీఎఫ్ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. మోరి, పెదపళ్ల సైట్లలో మొక్కలు నాటారు. ప్లాంట్ల భద్రతపై ఓఎన్‌జీసీ అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఎస్‌పీఎఫ్ సిబ్బంది పనితీరును పరిశీలించి, తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ, ఏపీ సచివాలయం, శాసన సభ, హైకోర్టు, విమానాశ్రయాలు, విద్యుత్, సాగునీటి ప్రాజెక్టులు, నగదు నిల్వ కేంద్రాలతో పాటు తిరుపతి, విజయవాడ, శ్రీకాళహస్తి, శ్రీశైలం, అన్నవరం, సింహాచలం వంటి ప్రధాన దేవాలయాలకు, ఓఎన్‌జీసీకి, ప్రముఖులకు, ప్రభుత్వ ఆస్తులకు ఎస్‌పీఎఫ్ భద్రత కల్పిస్తోందని వివరించారు. కార్యక్రమంలో డీఎస్పీఓ కృష్ణయ్య, ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఎస్సై ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు. పెదపళ్లలో ఆయనను సిబ్బంది ఘనంగా సత్కరించారు.

వివేకానందుని బోధనలు యువతకు మార్గదర్శకం

ప్రముఖ ఆధ్యాత్మికవేత్త చాగంటి


వివేకపథం-2024 ఫోల్డర్‌ను ఆవిష్కరిస్తున్న చాగంటి కోటేశ్వరరావు

అనపర్తి: స్వామి వివేకానందుని బోధనలు నేటి యువతకు మార్గదర్శకమని, ప్రతి విద్యార్థీ వివేకానందుని సాహిత్యాన్ని తప్పనిసరిగా అధ్యయనం చేయాలని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు అన్నారు. అనపర్తి శ్రీరామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో 'వివేకపథం –2024' పేరిట రూపొందించిన స్వామి వివేకానంద జీవితం – సందేశం ఫోల్డర్‌ను చాగంటి ఆవిష్కరించి, తొలి ప్రతిని సమితి అధ్యక్షుడు పడాల సుబ్బారెడ్డికి అందజేశారు. కాకినాడలోని చాగంటి గోశాలలో గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, వివేకానందుని సందేశం, భావజాలం ప్రతి ఒక్కరిలో ఆత్మవిశ్వాసం పెంపొందిస్తాయని అన్నారు. ఆదర్శవంతమైన జీవితం గడిపిన వారి జన్మ చరితార్థమని, దేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు వివేకానందుడని అన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా విద్యార్థుల్లో స్ఫూర్తి నింపే విధంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్న అనపర్తి శ్రీరామకృష్ణ సేవా సమితి సభ్యులను అభినందించారు. రామకృష్ణ మిషన్ సభ్యుడు ఎం.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని ఏటా అనపర్తి మండలంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థులకు 'వివేకపథం ఫోల్డర్‌ను అందించి వాటిపై పోటీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వేట్లపాలెం శ్రీరామకృష్ణ సేవా సమితి కార్యదర్శి కంటిపూడి గోపాలకృష్ణ, సమితి ఉపాధ్యక్షులు తేతలి సుందరరామారెడ్డి, సత్తి రామకృష్ణారెడ్డి, సత్తి వెంకటరెడ్డి, కార్యదర్శులు నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి, తాడి చంద్రశేఖర్‌రెడ్డి, కొవ్వూరి సత్తిరెడ్డి, మల్లిడి సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.